ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
శనివారం 17 ఆగస్టు 2024



అక్కపల్లి అటవీ ప్రాంతంలో ఎలుగుబంటి సంచారం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 16: అక్కపల్లి గ్రామ శివారులోని కట్టమైసమ్మ అటవీ ప్రాంతంలో శుక్రవారం ఎలుగుబంటి సంచరించినట్లు స్థానిక పశువుల కాపరులు, రైతులు గుర్తించారు. ఎలుగుబంటి సంచిరించిన ప్రాంతంలోని పాదముద్రలను ఫోటోలు తీసి అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న అధికారులు పరిశీలించి ఎలుగుబంటి పాద ముద్రలుగా నిర్ధారించారు. అటవీ ప్రాంతంలో రైతులు, పశువుల కాపరులు ఒంటరిగా తిరగకూడదని సూచించారు. ఎలుగుబంటి సంచారంతో రైతులు, పశువుల కాపరులు భయాందోళన చెందుతున్నారు.

అహంకారం వల్లే కేసీఆర్‌ను ప్రజలు గద్దెదించారు



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు వెంకట్‌రెడ్డి

ఇల్లంతకుంట, ఆగస్టు 16: అహంకారపూరితంగా కేసీఆర్ వ్యవహరించడం వల్లనే ప్రజలు గద్దెదించారని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. మండలంలోని పొత్తూరు గ్రామంలో జిల్లా కార్యదర్శి గుంటి వేణు అధ్యక్షతన శుక్రవారం సీపీఐ నిర్మాణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో గుట్టలకు రైతు బంధు సహాయం అందించి, నిజమైన రైతులకు సహాయం అందలేదన్నారు. గత ప్రభుత్వంలో ఏఒక్క పథకం పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో నిరుపేద ప్రజలకు రక్షణ కరువయ్యిందన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా పేదల జీవితాల్లో వెలుగులు రావడం లేదన్నారు. శ్రమకు తగ్గ ఫలితం ఉండాలని, ప్రతి ఒక్కరికి కూడు, గూడు, గుడ్డ ఉండాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులకు అందాలని సూచించారు. రాష్ట్ర కార్యదర్శి కలవేని శంకర్ మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లా సీపీఐకి కంచుకోట అన్నారు. పార్టీని గ్రామగ్రామాన విస్తరించాలని సూచించారు. ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేయకుండానే సీపీఐ నాయకులు అనేక సార్లు శాసనసభకు వెళ్లారని గుర్తుచేశారు. నిరుపేదల పక్షాణ పోరాటం చేసిన వారిని ప్రజలు ఆదరిస్తారని తెలిపారు. సమావేశంలో రాష్ట్రకార్యదర్శి కలవేని శంకర్, జిల్లా కార్యదర్శి గుంటి వేణు, నాయకులు మంద సుదర్శన్, సావనపెల్లి మల్లేశం, అనసూర్య, మీసం లక్ష్మన్, భూంపెల్లి భూంరెడ్డి, పంతం రవి, జంగం అంజన్న, కడారి రాములు, నాగరాజు, వేణు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

- ఎంపీడీవో కార్యాలయం ఎదుట మాజీ సర్పంచ్‌ల నిరసన



ఎంపీడీవో కార్యాలయం ఎదుట భోజనం చేస్తున్న మాజీ సర్పంచ్‌లు

గంభీరావుపేట, ఆగస్ట్ 16: గంభీరావుపేట మండల పరిషత్ కార్యాలయం ఎదుట పెండింగ్ బిల్లులు చెల్లించాలని శుక్రవారం మాజీ సర్పంచ్‌లు నిరసన వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధికి కోసం లక్షలు ఖర్చు చేశామని, ఏళ్లు గడిచినా బిల్లులు రావడం లేదని వాపోయారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిరసన కొనసాగింది. మధ్యాహ్న సమయంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుటే భోనం చేసి నిరసన తెలిపారు. సాయంత్రం ఎంపీవో రాజేశ్వర్ వచ్చి ఉన్నతాదికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ నిరసన విరమించారు.

బాలింత, పసికందు మృతిపై విచారణ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 16: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలో ఇటీవల డెంగీ లక్షణాలతో మృతి చెందిన బాలింత తాళ్లపల్లి శిరీష, పసికందు మృతిపై జిల్లా మాతా, శిశు సంక్షేమ శాఖ ప్రోగ్రాం అధికారి అంజెలియా శుక్రవారం విచారణ చేపట్టారు. మృతురాలి ఇంటికి చేరుకుని వైద్య పరీక్షలకు సంబంధించిన రిపోర్టులను పరిశీలించారు. ఎన్ని రోజుల నుంచి జ్వరంతో బాధపడుతుంది.. ఎక్కడెక్కడ వైద్య చికిత్స చేయించారని మృతురాలి కుటుంబీకులను అడిగి తెలుసుకున్నారు. నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పించనున్నామని అధికారి అంజెలియా తెలిపారు. ఆమె వెంట డీపీవో ఉమ, వైద్యాధికారులు స్రవంతి, చిరంజీవి, హిమజ తదితరులు ఉన్నారు.

క్లాత్ బ్యానర్ ప్రింటింగ్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 16: క్లాత్ బ్యానర్ ప్రింటింగ్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జిల్లా అసోసియేషన్ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా ధ్యావనపల్లి పండరినాథ్, ఉపాధ్యక్షుడిగా కుసుమ కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా బూర నరేష్‌ను ఏకగ్రీవంగా సభ్యు లు ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో యెల్ది చక్రపాణి, గుండేటి రాజేశం, యెక్కలిదేవి శ్రీనివాస్, కోడం వెంకటేశం, గుండేటి వేణు, యెక్కలదేవి లక్ష్మినర్సు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చిగురిస్తున్న ఆశలు



- రేషన్ కార్డుల జారీకి సబ్ కమిటీ ఏర్పాటు
- ఏళ్లుగా ఎదురు చూస్తున్న అర్హులు
- కార్డులు వస్తేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలకు మోక్షం
- జిల్లాలో 40 వేల మంది దరఖాస్తుల పెండింగ్
- చేర్పులు, మార్పుల కోసం 20,606 మంది నిరీక్షణ
- జిల్లాలో రేషన్ లబ్దిదారులు 4.97 లక్షల మంది

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఇటీవల ప్రభుత్వం అర్హులకు రేషన్ కార్డులు అందజేస్తామని ప్రకటిం చడంతో దరఖాస్తుదారుల ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లాలో వేల సంఖ్య లోనే అర్హులైన బడుగు, బలహీన వర్గాలకు రేషన్ కార్డులు లేక సంక్షేమ పథకాలు పొందేందుకు ఆటంకంగా మారింది. రైతు రుణమాఫీలో కూడా పలువురు రేషన్ కార్డు లింక్‌తో అందుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఇతర పథకాలకు సైతం ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ క్రమంలో ఎన్నో ఏళ్లుగా రేషన్‌కార్డుల కోసం చివరకు పెరిగిన కుటుంబ సభ్యుల పేర్లు కూడా కార్డుల్లో నమోదు చేసుకోని పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నా వారికి ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీకి చర్యలు తీసుకుంటుండడంతో ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రభుత్వం సబ్ కమిటీ వేయడంతో దరఖాస్తు దారుల్లో మళ్లీ కార్డులు వస్తాయనే ఆనందం వ్యక్తం అవుతోంది. తొమ్మిది ఏళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నా వారు ఉన్నారు. కొత్త రేషన్ కార్డుల జారీ కోసం క్యాబినేట్ స్థాయిలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిల ను సభ్యులుగా నియమించారు. సబ్ కమిటీ ఏలాంటి విధి విధానాలు రూపొందింస్తుంది ప్రభుత్వానికి ఏలాంటి సిఫార్సులు చేయబోతుందోననే అనేదానిపై ఆసక్తి ఏర్పడింది. కొత్త రేషన్ కార్డుల జారీ కోసం పట్టణాల్లో రూ 2లక్షల లోపు, గ్రామాల్లో రూ 1.50 లక్షల వార్షిక ఆదాయం, మాగాణి 3.50 ఎకరాలు, చెలకలు 7.5 ఎకరాలు లోపు ఉన్నవారికి తెల్ల రేషన్ కార్డు ఇవ్వాలని ప్రతిపాదించింది.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రేషన్ కార్డుల కోసం ఆరు గ్యారంటీల పథకాల దరఖాస్తులతో పాటు రేషన్ కార్డుల దరఖాస్తులను కూడా తీసుకున్నారు. ఆరు గ్యారంటీల్లో రేషన్ కార్డు ఆప్షన్ లేకపోయినా విడిగా దరఖాస్తులను స్వీకరించారు. గతంలో కాంగ్రెస్ పాలనలో అమ్మహ స్తం పథకం కింద రూ 185కే తొమ్మిది రకాల నిత్యావసర సరుకు లను అందించింది. బియ్యంతో పాటు కందిపప్పు, చింతపండు, గోధుమలు, గోధుమ పిండి, కారంపొడి, నూనె, తదితర సరుకులు పంపిణీ చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తెల్లరేషన్ కార్డులను ఆహార భద్రత కార్డులు గా మార్చి కేవలం బియ్యానికే పరిమితం చేశారు. అంతేకాకుండా రేషన్ కార్డుల్లో పేర్లు లేకపోవడంతో ఆరోగ్య సమస్య వస్తే కలెక్టరేట్‌లో ఆరోగ్య శ్రీ టస్ట్ ద్వారా తాత్కలికంగా ఓ కార్డును జారీ చేసేవారు. ఇలా పలు ఇబ్బందులు పడుతున్న క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్డుల జారీకి పార్లమెంట్ ఎన్నికల కోడ్‌తో ఇంకా పక్రియ మొదలు కాలేదు. తాజాగా సబ్ కమిటీ వేసి త్వరలోనే రేషన్ కార్డులు అందిస్తామని ప్రకటించడంతో జిల్లాలో అర్హులైన దరఖాస్తుదారుల్లో ఆశలు మొదలయ్యాయి.

ఆరు గ్యారంటీల దరఖాస్తుల్లో..

జిల్లాలో ఆరు గ్యారంటీల దరఖాస్తుల్లో 1.92 లక్షలు వివిధ అప్షన్లలో దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో 40 వేల మంది వరకు రేషన్ కార్డు లు, చేర్పులు, మార్పుల కోసం దరఖాస్తులు ఇచ్చారు. గతంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను రేషన్ కార్డులు లేకపోవడంతో అందుకోలేకపోయారు. రేషన్ కార్డుల్లో నమోదైన కుటుంబ సభ్యులకే సంక్షేమ పథకాలు అందిన నేపథ్యంలో తెల్లరేషన్‌కార్డు లేకపోవడంతో అనేకమంది డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ప్రభుత్వం ఇచ్చే ఇండ్ల స్థలాలు అందుకోలేక పోయారు. మరోవైపు వివిధ ధ్రువీకరణ పత్రాలు పొందే సమయంలో కూడా ఇబ్బందులను ఎదుర్కుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల్లో ఆన్‌లైన్ చేసిన దరఖాస్తుల్లో బోయినపల్లి మండలంలో 12,808 మంది, చందుర్తిలో 11,737 మంది, ఇల్లంతకుంటలో 16,598 మంది, గంభీరావుపేటలో 15,567 మంది, కోనరావుపేటలో 14,802 మంది దరఖాస్తు చేసుకు న్నారు. ముస్తాబాద్‌లో 16,127, రుద్రంగిలో 5,404, తంగళ్లపల్లిలో 16,766 మంది, వీర్నపల్లిలో 4,741, వేములవాడలో 7,854, వేములవాడ రూరల్‌లో 8,050, ఎల్లారెడ్డిపేటలో 17,030, సిరిసిల్ల మున్సిపాలిటీలో 30,146, వేములవాడ మున్సిపాలిటీలో 14987 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందు లో చాలా మంది తెల్ల రేషన్ కార్డు లేని వారు ఉన్నారు.

జిల్లా వ్యాప్తంగా..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రస్తుతం లక్షా 73 వేల 745 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో ఆహార భద్రత కార్డులు 1,59,854, అంత్యోదయ కార్డులు 13,684, అన్నపూర్ణ కార్డులు 207ఉన్నాయి. కార్డుల పరిధిలో 4 లక్షల 97 వేల 103 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో అంత్యోదయ కార్డుల్లో 36,526 మంది, ఆహార భద్రత కార్డుల్లో 4,60,367, అన్నపూర్ణ కార్డుల్లో 210 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా 32,43,212 కిలో బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు.

కార్డుల్లో మార్పులకు..

జిల్లాలో రేషన్ కార్డుల్లో **చేర్పులు,** మార్పుల కోసం 20,606 మంది దరఖాస్తులు చేసుకున్న వారు ఉన్నారు. నిత్యం రేషన్ కార్డులు వస్తున్నా యని చేర్పులు, మార్పులకు అవకాశం ఇచ్చారనే ప్రకటనలతో అయోమ యంలో ఉన్న వారికి ఈ సారైనా మోక్షం కలుగుతుందని భావిస్తున్నారు. ఇందులో కొంత మేరకు పరిశీలన జరిగినా మార్పులు మాత్రం జరగలేదు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల్లో బోయినపల్లి మండలంలో 1,321, చందుర్తిలో 1,760, గంభీరావుపేటలో 2,125, ఇల్లంతకుంటలో 1,760, కోనరావుపేటలో 1,403, ముస్తాబాద్‌లో 1,914, రుద్రంగిలో 948, సిరిసిల్లలో 2,689, తంగళ్లపల్లిలో 1,333, వీర్నపల్లిలో 481, వేములవాడ రూరల్‌లో 1,105, వేములవాడలో 2,105, ఎల్లారెడ్డిపేటలో 2,032 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న కాలంలో కొత్త కార్డులు రాకపోగా కనీసం ఉన్న కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చకపోవడం. చేర్పులు, మార్పులు కూడా జరుగలేదు. రేషన్ కార్డుల్లో పిల్లల పేర్లు, కోడళ్ల పేర్లు చేర్చాలంటూ వేలాది మంది కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. ప్రజావాణిలో దరఖాస్తులు చేసుకుంటున్నారు. వీటితో పాటు గతంలోనే రేషన్ కార్డు కోసం 40 వేల మంది వరకు అర్హులు దరఖాస్తులు చేసుకున్నారు. 2018 సంవత్సరానికి ముందు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్న వారిలో 2021 ఆగస్టులో 2271 మందికి రేషన్ కార్డులు అందించారు. ఆ తరువాత కనీసం మీ సేవా ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కూడా అందించలేకపోయారు. ప్రస్తుతం కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామనే ప్రభుత్వ ప్రకటనలతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.



సెప్టెంబరు 30లోగా సీఎంఆర్ పూర్తి చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, అగస్టు 16: సీఎంఆర్ బియ్యాన్ని సెప్టెంబరు 30వ తేదీలోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో శుక్రవారం రైస్‌మిల్లర్లతో సీఎంఆర్ బియ్యంపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023 - 24 సంవత్సరం ఖరీఫ్‌కు సంబంధించి లక్షా 34వేల 861 క్వింటాళ్ల రా రైస్ ఇవ్వాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు 63వేల 742 క్వింటాళ్లను ఎఫ్‌సీఐకి అప్పగించామని చెప్పారు. జిల్లాలోని రైస్ మిల్లందరూ వారికి కేటాయించిన ధాన్యాన్ని వచ్చే నెల 30వ తేదీలోగా ఎఫ్‌సీఐకి సీఎంఆర్ బియ్యాన్ని అందజేయాలన్నారు. జిల్లాలోని రైస్‌మిల్లు వారిగా ఇచ్చిన లక్ష్యం వారు పూర్తి చేసిన ఉత్పత్తివివరాలు వెల్లడించారు. ఇప్పటివరకు రా రైస్ ఇవ్వడంలో వెనుకబడిన మిల్లులను గుర్తించి వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయా మిల్లులను నిత్యం తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించారు. మిల్లర్లు సైతం కేటాయించిన లక్ష్యం మేరకు అందజేసి సహకరించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, జిల్లా మేనేజర్ జితేందర్‌ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

ధరణి దరఖాస్తులపై దృష్టి సారించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, అగస్టు 16: ధరణిలో వచ్చిన భూ సమస్యల దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సంబంధిత అధికారు లను అద నపు కలెక్టర్ ఖీమ్యానా యక్ ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం ఆర్డీవోలు, తహసీల్దార్‌లతో ధరణి దరఖాస్తులపై సమీక్షించారు. జిల్లాలోని అన్ని మండలాల వారిగా పెండిం గ్‌లో ధరణి దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్‌లు లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఆర్డీవోలకు పంపించాల చెప్పారు. జిల్లా స్థాయిలో పరిశీలించిన అనంతరం పరిష్కరించనున్నామని అదనపు కలెక్టర్ అన్నారు. అయా లాగిన్‌ల్లో కలిసి మొత్తం 866 దరఖాస్తులు పెండింగ్ లోఉన్నాయని అధికారులు వాటిని పరిష్కారించాలని సూచించారు. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో రమేష్, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

23న పోచమ్మ ఆలయంలో వేలంపాట

ఇల్లంతకుంట, ఆగస్టు 16: మండలంలోని అనంతగిరి గ్రామంలోని ముత్యాల పోచమ్మ ఆలయంలో ఈ నెల 23న వేలంపాట నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహణ అధికారి వెంకట మారుతిరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొబ్బరి ముక్కలు పోగుచేయుట, లడ్డు, పులిహోరాలను ఏడాది పాటు అమ్మకాల హక్కులు పొందడానికి వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, ఆగస్టు 16: ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో శుక్రవారం నాటికి 1.87టీఎంసీలకు చేరుకున్నాయి. మధ్యమానేరు ద్వారా 6400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్‌కు 3300క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

వాహనాల పన్నులు చెల్లించాలి

- కళాజాతా ద్వారా అవగాహన

ఇల్లంతకుంట, ఆగస్టు 16: వాహనాల పన్నులు సకాలంలో చెల్లించాలని కోరుతు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు మండలకేంద్రంలో శుక్రవారం కళాజాతా ప్రదర్శన చేశారు. రవాణా వాహనాల త్రైమాసిక పన్నులు సకాలంలో చెల్లించి రవాణాశాఖకు సహకరించాలన్నారు. పన్నులు చెల్లించని వాహనాలకు అధికారులు జరీమానాలు విధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారధి కళాకారులు ఎడ్మల శ్రీధర్‌రెడ్డి, శ్రీరాముల రామచంద్రం, గడ్డం శ్రీనివాస్, గుగ్గిళ్ళ పర్శరాం, వంతడుపుల గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

దోషులను గుర్తించి శిక్షించాలి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 16: కలకత్తలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్యకు పాల్పడిన దోషులను గుర్తించి న్యాయపరంగా కఠినంగా శిక్షించాలని శుక్రవారం సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాల ఎదుట వైద్యులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జీజీహెచ్ డిప్యూటి సూపరిం టెండెంట్ చీకోటి సంతోష్ మాట్లాడారు. తమ డిమాండ్స్‌ను నెరవేర్చకుంటే వైద్య సేవలను నిలిపివేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమానికి ఏఎంఏ, ఆల్ ఇండియా, ఆర్‌డీఏ, జెడీఏ, టీఎస్ ఆర్‌డీఏ, టీజేయూడీఏ, హెచ్‌ఆర్‌డీఏ, టీఏఎన్‌ఏ సంఘాలు మద్దనిచ్చాయి. ఆర్‌ఎంవోలు కాశీనాథ్, సాయి, వైద్యులు పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 16: ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందడి నెలకొంది. వేములవాడ పట్టణంలో శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా ఆధ్మాత్మిక శోభ నెలకొంది. శ్రావణ శుక్రవారం కావడంతో శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయం మహిళలతో సందడిగా మారింది. పట్టణంలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయం, రాజన్న ఆలయంలోని శ్రీపార్వతి దేవి అమ్మవార్ల ఆలయాల్లో భక్తులు రద్దీ నెలకొంది. లక్ష్మిదేవికి అత్యంత ప్రీతిపాత్రమైన రోజు కావడంతో మహిళలు ఒడి బియ్యం పోసేందుకు అమ్మవారి ఆలయాల్లో గంటలపాటు క్యూలైన్‌లో బారులు తీరారు. కాగా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి శ్రావణ శుక్రవారంను పురష్కరించుకుని భక్తులు పోటేత్తారు. వివిధ ప్రాంతాల నుంచి రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు ముందుగా కల్యాణ మండపంలో తలనీలాలు సమర్పించారు. ధర్మగుండంలో పవిత్ర స్నానాలను చేసిన భక్తులు ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతి పరమేశ్వరులను దర్శించుకున్నారు. శ్రీస్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొ ుక్కు చెల్లించుకుని, గండా దీపంలో నూనే పోస్తూ గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు తరించారు. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందుల తలెత్తకుండా ఉండేందుకు ఆలయ ఈవో నేతృత్వంలో ఆలయ ఏఈవోలు బ్రహ్మన్న గారి శ్రీనివాస్, రమేష్‌బాబు, సూపరిండెంట్ తిరుపతిరావు, పీఆర్వో రాజన్‌బాబులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- అమ్మవారికి ప్రత్యేక పూజలు

వేములవాడ పట్టణంలోని పలు ఆలయాల్లో శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజన్న ఆలయంలోని శ్రీరాజరాజేశ్వ రీదేవి అమ్మవారికి ఉదయం, సాయంత్రం చతుష్షష్టి ఉపచారముతో విశేషపూజల నిర్వహించగా శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి సాయంత్రం 4 గంటలకు షోడశో పచార పూజలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తుల కు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



రాజన్న దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

విలీన గ్రామాలను గ్రామపంచాయతీలుగా మార్చాలి

సిరిసిల్ల రూరల్, అగస్టు 16: సిరిసిల్ల మున్సిపల్‌లో విలీనం చేసిన గ్రామాలను తిరిగి గ్రామపంచాయతీలుగా మార్చి గ్రామీణా ప్రాంతాల ప్రజలకు న్యాయం చేయాలని విలీన గ్రామాల ఐక్యవేదిక నాయకులు సలేంద్రి బాలరాజుయాదవ్, బెజ్జారపు చందుగౌడ్, కౌన్సిలర్లు చెన్నమనేని కీర్తికమాలాకర్‌రావు, లింగంపల్లి సత్యనారాయణ, భూక్యరెడ్డినాయక్, బోల్గం నాగరాజుగౌడ్‌లు డిమాండ్ చేశారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామంలో జేఏసీ అధ్వర్యం లో గ్రామస్థులు, నాయకులు కలిసి ర్యాలీ నిర్వహించి వార్డు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరిసిల్ల అర్బన్‌మండలంగా మార్చిన ఏడు గ్రామాలను తిరిగి సిరిసిల్ల మున్సిపాల్టీలో విలీనం చేసిన తరువాత గ్రామాల్లో కూలీలకు ఉపాధిహామీ పథకంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలకు దూరమైపోయారన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విలీన గ్రామాలను తిరిగి గ్రామపంచాయతీలుగా మార్పు చేయిస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సైతం విలీన గ్రామాలను గ్రామపంచాయితీలుగా మార్పు చేస్తానని చెప్పడంతోపాటు మున్సిపల్ సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించారని చెప్పారు. ప్రభుత్వ విప్ స్పందించి చర్యలు తీసుకోఆలని కోరారు.. కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మన్ ఎరవెళ్లి వెంకటరమణారావు, రమేష్‌రావు, సింగిల్ విండో చైర్మన్ జీలకిషన్‌యాదవ్, వైస్ చైర్మన్ బెజ్జరపు నారాయణగౌడ్, అదిపెలి దేవయ్యగౌడ్, కొంపెల్లి రవీందర్, అతికం నర్సయ్య, రాకం రమేష్, తమ్మెట జీవన్, బీజేపీ నాయకులు వంగ అనిల్‌కుమార్‌గౌడ్ టెకు జంపరాజు, అదిపెల్లి శంకరయ్యగౌడ్, గుగ్గిళ్ల రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మానకొండూర్, ఆగస్టు 16: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మానకొండూర్‌లో శుక్రవారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని వెల్ది గ్రామంలోని మానేరువాగు నుంచి కరీంనగర్‌కు ఇసుకను రవాణా చేస్తుండగా పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమాని చంద్, రాకేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు.

సింగరేణి కార్మికుడి అదృశ్యం

జ్యోతినగర్, ఆగస్టు 16 : అన్నపూర్ణకాలనీకి చెందిన ధర్మల రామ్మోహన్ (45) అనే సింగరేణి కార్మికుడు అదృశ్యమయ్యాడు. కొన్ని రోజుల క్రితం డ్యూటీకి వెళ్తున్నానని ఇంట్లో నుంచి వెళ్లిన రామ్మోహన్ తిరిగి ఇంటికి రాలేదని, ఫోన్ చేస్తే కొత్తగూడెం వెళ్తున్నానని చెప్పినట్లు అతడి భార్య రాజకుమారి శుక్రవారం ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ బుచ్చి నాయుడు తెలిపారు.

రైస్‌మిల్లులో అగ్ని ప్రమాదం



ధాన్యం పంచులను బయటకు తెస్తున్న స్థానికులు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 16: పెద్దపల్లి మండలంలోని భోజన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలోని త్రివేణి రైస్ మిల్లులో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఫైర్‌స్టేషన్ అధికారి రాజేందర్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అయినా మంటలు అదుపులోకి రాకపోవడంతో గోదావరిఖని ఫైర్ ఇంజన్‌ను రప్పించారు. సుమారు రెండు గంటల పాటు మంటలను అదుపులోకి తీసుకోచ్చే ప్రయత్నం చేశారు. ఎంత నష్టం వాటిల్లింది అనేది తేల లేదని ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

వాహనాల తనిఖీల్లో గంజాయి పట్టివేత

గొల్లపల్లి, ఆగస్టు 16: జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు పెగడపల్లి గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేస్తుండగా శుక్రవారం సాయంత్రం ఐదుగురు అనిమానిత వ్యక్తుల నుంచి 200 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు పెగడపల్లి ఎస్సై కిరణ్ తెలిపారు. పెగడపల్లి గ్రామానికి చెందిన మల్యాల అజయ్ వద్ద గంజాయిని కొనుగోలు చేసిన జగిత్యాల పరిసర ప్రాంతాలకు చెందిన ఐదుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలపై పెగడపల్లి నుంచి బతికపల్లి రోడ్డు మీదుగా వెళ్తుండగా డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ రవి ఆధ్వర్యంలో పెగడపల్లి ఎస్సై కిరణ్ పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలను, ఐదు సెల్‌ఫోన్‌లను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ రవి ఉన్నారు.

అదృశ్యమైన యువకుడి ఆచూకీ లభ్యం



పోలీసుల అదుపులో గంగరాజు

చందుర్తి, ఆగస్టు 16: చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి గ్రామంలో అదృశ్యమైన ఎక్కలదేవి గంగరాజు అనే యువకుడి ఆచూకీ శుక్రవారం ఉదయం లభించింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎక్కలదేవి గంగరాజు గురువారం తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో తన ద్విచక్ర వాహ నంపై వివాదంలో ఉన్న భూమి వద్దకు వెళ్లి అదృశ్యమవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. కాగా శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని ఒర్రె ప్రాంతంలో కొబ్బరి తాళ్లతో కాళ్లు, చేతులు కట్టేసి ఉండి, అరుస్తున్న గంగరాజును గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన చేరుకుని గంగరాజును అదుపులోకి తీసు కొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనపై విచారణ చేపడుతు న్నామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గంగరాజును ఎవరు, ఎందుకోసం పట్టుకెళ్లి తాళ్లతో బంధించి వదిలేశారు అనేది మిస్టరీ వీడాల్సి ఉంది. కాగా అదృశ్యమైన గంగరాజు ఆరుగురు వ్యక్తులు వచ్చి తనపై దాడి చేసి ముసు గు కప్పి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారని, తన నోట్లో టవల్ పెట్టడంతో ఊపిరి ఆడక స్పృహ తప్పి పడిపోయానని, శుక్రవారం ఉదయం గ్రామ శివారులో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు తాళ్లతో కాళ్లు, చేతులు బంధించి వదిలి వెళినట్లు పోలీసులకు తెలిపినట్లు సమాచారం

ఉరివేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 16: సిరిసిల్ల పట్టణంలోని అంబికానగర్‌కు చెందిన సిరిమల్లే లక్ష్మీనారాయణ(70)శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అంబికానగర్‌కు చెందిన లక్ష్మీనారాయణ పవర్‌లూం కార్మికుడిగా పనిచేసే వాడు. అతడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. భార్య, పెద్ద కుమారుడు గతంలోనే మృతిచెందారు. చిన్నకుమారుడి వద్ద ఉంటున్న లక్ష్మీనారాయణ వయస్సు భారంతో పని చేయలేక పోతన్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. రోజు విధంగానే మదం తాగి అదే మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నారు. తన తండ్రి మద్యం మత్తులోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుమారుడు రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య



దేవేందర్‌రెడ్డి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 16: అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన జీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నేవూరి దేవేందర్‌రెడ్డి (52) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. దేవేందర్‌రెడ్డి వ్యవసాయం చేయడంతో పాటు గత 20 ఏళ్లుగా బీజేపీలో కొనసాగుతున్నారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆసుపత్రుల్లో చూపించిన నయం కాలేదు. దీంతో పాటు మద్యం తాగుతుండే వాడు. ఇంట్లో గొడవలు చోటు చేసుకుంటుండడంతో స్థానికంగా అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన భార్య నర్మద సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక మండలం రాజక్కపేటలోని తన తల్లిగారింటికి వెళ్లింది. అక్కడ నుంచే నిత్యం ఎల్లారెడ్డిపేటకు వస్తూ విధులు నిర్వహిస్తున్నారు.

ఇంటిలో ఒంటరిగా ఉంటున్న దేవేందర్‌రెడ్డి మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య నర్మద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు. మృతుడికి భార్య నర్మద, కొడుకు, కూతురు, తల్లి ఉన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి, ఉపాధ్యక్షుడు రాజులతో పాటు ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు దేవేందర్‌రెడ్డి మృతదేహంపై పార్టీ జెండాను కప్పి నివాళులు అర్పించారు. అనంతరం అంత్యక్రియాల్లో పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య



భాను (ఫైల్)

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 16: సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన కొండ భాను (40) అనే ఆటో మొబైల్ స్టోర్ యజమాని అప్పుల బాధతో షాప్‌లోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన పవర్‌లూం యజమాని కొండ నారా యణ కుమారుడు భాను కొత్తచెరువు కింద ఆటోనగర్‌లో శ్రీకమల్ ఆటోమొబైల్ స్టోర్‌ను పదేళ్ల క్రితం నెలకొల్పాడు. భానుకు ఆరేళ్ల క్రితం దీప్తితో వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. శుక్రవారం ఉదయం భార్యకు చెప్పి ఇంటినుంచి షాప్‌కు వెళ్లాడు. షాప్‌కు వెళ్లి వచ్చేవరకు పిల్లలను అమ్మమ్మ ఇంట్లో దించివచ్చేందుకు రెడీ ఉంచమని చెప్పాడు. మధ్యాహ్నమైన భాను రాకపోవడంతో భార్య ఫోన్‌చేసినా లిఫ్ట్ చేయలేదు. ఇంట్లోకి వెళ్లి చూడగా దండెం కట్టిన నైలాన్ తాడు కనిపించలేదు.

దీంతో అనుమానం వచ్చిన భార్య వెంటనే ఆమె మరిదికి ఫోన్‌చేసి అన్న ఇంటికి వస్తానని చెప్పి వెళ్లి రాలేదని చెప్పింది. ఆమె మరిది మరో ఇద్దరు కలిసి ఆటోమొబైల్ స్టోర్‌కు వెళ్లి షటర్ పైకి లేపి చూశారు. భాను ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. ఆటో మొబైల్ స్టోర్‌లో గత కొంతకాలంగా సక్రమంగా అమ్మకాలు లేవని, ఆర్థిక ఇబ్బందులు ఏర్పడడంతో తన భర్త భాను ఆత్మహత్యకు పాల్పడ్డాడని భార్య దీప్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టు మార్టంకోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో డిష్ ఆపరేటర్..

కరీంనగర్ క్రైం: నగరంలోని భగత్‌నగర్‌కు చెందిన డిష్ ఆపరేటర్ గీకురు మిథున్ కుమార్(35) ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ రెండో టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలిపారు. మిథున్‌కుమార్ డిష్‌ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. భగత్‌నగర్‌లో నివాసం ఉంటున్న మిథున్‌కుమార్ ఆర్థిక బ్బందులతో బాధపడుతూ మద్యానికి బానిసగా మారాడు. మిథున్ భార్య, రెండు మూడు రోజుల కిందట తన పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. ఒంటరిగా ఉన్న మిథున్‌కుమార్ శుక్రవారం ఉదయం 5:41 గంటలకు భార్యకు వాట్సాప్‌లో 'సారీ మళ్లీ జీవితం ఉంటే మా బంగారు తల్లుల (కూతుళ్లు) కడుపులో పుడుతా' అంటూ మెస్సేజ్ పెట్టాడు.

మెస్సేజ్‌ను చూసిని అతని భార్య మౌనిక వెంటనే పిల్లలతో కలిసి భగత్‌నగర్ ఇంటికి వచ్చి చూసేసరికి మిథున్‌కుమార్ గది తలుపులు బిగించుకుని ఉన్నాడు. స్థానికుల సహకారంతో బలవంతంగా తలుపులు తెరిచేసరికి ఉరికి వేళా డుతూ కనిపించాడు. వెంటనే కిందకు దించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చగా వైద్యులు పరీక్షించి మరణించినట్లు వెల్లడించారు. ఆర్థిక ఇబ్బం దులతో తాగుడకు బానిసగా మారి జీవితంపై విరక్తి చెంది తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య మౌనిక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. మిథున్ కుమార్‌కు 7, 5 సంవత్సరాల వయస్సు కలిగిన ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి
కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 7,741 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి ఒక మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, హైదరాబాద్, ఆయా నియోజకవర్గాల ప్రజల తాగునీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.913 టీఎంసీల నీళ్లున్నాయి. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు లేక వరద తగ్గుముఖం పట్టడంతో కేవలం ఒక మోటార్ నుంచే నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద పెరిగి అవకాశాలున్నాయి. దీంతో శనివారం మరో మోటారును ఆన్ చేసే సూచనలు కనబడుతున్నాయి.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
కాకతీయ కాలువకు పెరిగిన నీటి విడుదల

జగిత్యాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో రావడం శుక్రవారం కొనసాగింది. వానాకాలం పంటల సాగు కోసం ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీలోకి 10,680 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 48.07 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 5,603 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

అంబేద్కర్ విద్యా నిధికి దరఖాస్తుల ఆహ్వానం

గణేష్‌నగర్, ఆగస్టు 16: అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తు న్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి, ఉప సంచా లకులు ఎం నగ్రెలేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను విదేశీ విద్యాలయాల్లో విద్యను అభ్యసించే ఎస్సీ విద్యార్థులు 20 లక్షల రూపాయల స్కాలర్ షిప్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 16 నుంచి సెప్టెంబరు 13వ తేదీ వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

శంకరపట్నం, ఆగస్టు 16: సైదాపూర్ మండలంలోని సోమారం గ్రామానికి చెందిన ఓ రైతు శంకరపట్నం మండలంలోని కేశవపట్నం శివారులో గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమారం గ్రామానికి చెందిన సుంకరి సారయ్య (60) తనకున్న మూడెకరాల భూమిలో ఒక ఎకరం భూమి అదే గ్రామానికి చెందిన పెరుమండ్ల రాజబాబు అనే వ్యక్తికి అమ్మినట్లు తెలిపారు. అతడు ఒక ఎకరం భూమికి బదులుగా మూడెకరాల భూమిని పట్టా చేసుకున్నాడని పేర్కొన్నారు. దాంతో రైతు మనస్థాపం చెంది ఈ నెల 14న మొలంగూర్ నుంచి సైదాపూర్ వెళ్లే దారిలో అరటి తోట వద్ద కేశవపట్నం శివారులో గడ్డి మందు తాగాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యు లు చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 15న అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు సుంకరి చందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

ఆర్‌ఎంపీ వైద్యం వికటించి మహిళ మృతి

శంకరపట్నం, ఆగస్టు 16: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన సాయిల్ల స్వప్న (32) అనే మహిళ జ్వరంతో శుక్రవారం మృతి చెందింది. మహిళకు ఓ ఆర్ఎంపీ చికిత్స అందించగా వైద్యం వికటించి మృతి చెందిందని గ్రామస్థులు, మృతురాలి బంధువులు ఆరోపించారు. వారు తెలిపిన ప్రకారం.. స్వప్నకు జ్వరం రావడంతో రెండు మూడు రోజులుగా ఆర్ఎంపీ వైద్యం అందిస్తున్నాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. కొంత సమయం తర్వాత మృతిచెందినట్లు తెలిపారు. వైద్యం వికటించి స్వప్న మృతిచెందినట్లు గ్రామస్థులు, బాధిత కుటుంబీకులు ఆరోపించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులున్నారు.

ప్రభుత్వాసుపత్రి సేవలు
సద్వినియోగం చేసుకోవాలి



హెల్త్ డైరెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న వైద్యాధికారులు, సౌకర్యాలను తెలుసుకుంటున్న రవీందర్‌నాయక్

రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్

కొడిమ్యాల, ఆగస్టు 16: ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్, ఫ్యామిలీ వెల్ ఫేర్ డా.. రవీందర్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హెల్త్ డైరెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ల్యాబ్, ఆసుపత్రి గదులను, ఇన్‌పేషెంట్ రూంలను, ఫార్మాసిస్ట్ రూంను పరిశీలించారు. పలువురు పేషెంట్లుకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. డెలివరీలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అయ్యేలా మహిళలకు అవగాహన కలిపించాలన్నారు. అనంతరం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రభలకుండా జిల్లా, మండల వైద్య అధికారులు, సిబ్బంది నిరంతరం ప్రజలకు అవగాహన కలిపిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్న సేవలను గురించి, అందిస్తున్న మందులను గురించి ప్రజలకు ఎప్పటికప్పుడు తెలుపాలని వైద్యాధికారులను, సిబ్బందిని ఆదేశించారు. డెంగ్యూ, చికెన్‌గున్యా, టైఫాయిడ్, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు వస్తే ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స ఉచితంగా లభిస్తుందన్నారు. ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్న వైద్య అధికా రులు, సిబ్బంది పని తీరుపట్ల ఫలితం బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి గదుల విస్తరణ, కొడిమ్యాల మండలానికి అంబులెన్స్ కెటాయింపు గురించి డీఎంహెచ్‌వోకు సి ఫారస్ చేశారు. మండల కేంద్రానికి అంబులెన్స్ కెటాయించాలని, ఆ సుపత్రిలో రాత్రి వేళల్లో వైద్యులను ఏర్పాటు చేయాలని బీజేపీ నాయ కుడు బోగ రాకేష్ హెల్త్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమియొద్దీన్, జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డా.. శ్రీనివాస్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ (ఎన్‌సీడీ) డా. అర్చన, డీపీవో (ఎన్‌హెచ్‌ఎం) డా. రవీందర్, మండల వైద్యాధికారి పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ సత్యనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీధర్, సూపర్‌వైజర్లు మురళి, శ్రీనివాస్, వెంకటనర్సమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

'పోపా' రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పోలు సత్యనారాయణ



నియామకపత్రాన్ని అందుకుంటున్న పోలు సత్యనారాయణ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 16: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్స్ (పోపా) వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కరీంనగర్‌కు చెందిన రిటైర్డు టీచర్, ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు పోలు సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం కరీంనగర్‌లోని పద్మశాలి భవన్‌లో జరిగిన పోపా సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు బైరి శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 33 జిల్లాలు తిరుగుతూ పద్మశాలి ఐక్యత కోసం కృషిచేయాలని అన్నారు. ఉపాధ్యాయుడిగా, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధిగా టీచర్లతో సత్సంబంధాలు కలిగి ఉన్నందున త్వరలో జరిగే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసి సత్తాచాటాలని సత్యనారాయణకు సూచించారు. రాజకీయ రంగంలో పద్మశాలీలు వెనుకబడి ఉన్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పద్మశాలీలు పోటీచేసి ఘన విజయం సాధించాలని, ఇందుకోసం పద్మశాలి సంఘాలన్నీ ఐక్యతగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం శ్రీరాములు, పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వొల్లాల కృష్ణహరి, పోపా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎలిగేటి మల్లికార్జున్, నాయకులు మంచికట్ల రమేశ్, గోలి వినోద్‌కుమార్, ఎలిగేటి శ్రీనివాస్, పిస్కా లక్ష్మీనారాయణ, కొక్కుల గోవర్ధన్, ఆడెపు శ్రీనివాస్, దేవసాని సంపత్‌కుమార్, రుద్ర రమేశ్, దండె రాజశేఖర్, ఆదిచెర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

పోతన కాలనీలో చోరీలు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 16: గోదావరిఖని టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోతనకాలనీలోని సింగరేణి కార్మిక క్వార్టర్స్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. టుటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని 31 బ్లాక్- 427 క్వార్టర్‌లో లాగల అనిల్ ఇంట్లో తాళం పగులగొట్టి రూ.5వేల నగదు, 32 బ్లాక్‌లో నివాసముం టున్న సురేష్ ఇంట్లో 8తులాల వెండి పట్టీలు, 13వ బ్లాక్‌లో బొట్ల సంపత్‌కు చెందిన ద్విచక్ర వాహనం దొంగిలించినట్లు తెలిపారు. వీరందరూ తమ కుటుంబాలతో కలిసి ఊరికి వెళ్లారని, శుక్రవారం తెల్లవారుజామున క్వార్టర్ల తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించిన చుట్టు పక్కల వారు సమాచారం ఇచ్చినట్టు పోలీసులు తెలిపారు. బాధితులు వచ్చి దొంగతనం జరిగినట్టు గుర్తించి ఫిర్యాదు చేశారన్నారు. అలాగే బ్లాక్ నెం.31లో తాళం వేసి ఉన్న 426, 428, 430 క్వార్టర్లలో తాళాలు పగుల గొట్టారని, ఆయా క్వార్టర్లలో ఎవరూ నివాసముండడం లేదన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 16 : మండలంలోని కందుగుల గ్రామ శివారులో ఓ వ్యక్తి అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కందుగుల గ్రామానికి చెందిన గందె శ్రీ తిరుపతి అనే వ్యక్తి గ్రామంలో తక్కువ ధరకు ప్రజల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి హుజూరాబాద్ పట్టణంలోని ఓ రైస్ మిల్లులో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో రెండు బియ్యం సంచులతో ద్విచక్ర వాహనంపై హుజూరాబాద్‌కు వస్తున్న క్రమంలో పోలీసులను చూసి పక్కగా పారిపోతుండగా పట్టుకొని విచారించినట్లు తెలిపారు. ఆ వ్యక్తిని బియ్యం అమ్మిన మిల్లుకు తీసు కొని వెళ్లి విచారించగా ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యమైనట్లు తెలిపారు. బియ్యం విలువ రూ. 1,0800 ఉందని తెలిపారు. ఈ మేరకు సీఐ తిరుమల్ కేసు నమోదు చేసి పీడీఎస్ బియ్యాన్ని, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

ధర్మపురి క్షేత్రంలో శ్రావణ సందడి
ఆలయాల్లో ఉద్యాపన, కుంకుమ పూజలు



గోదావరిలో భక్తుల స్నానాలు

ధర్మపురి, ఆగస్టు 16: శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో రెండవ శుక్రవారం భక్తజన సందడి నెలకొంది. వరలక్ష్మి శుక్రవారం కూడ తోడు కావడం వల్ల అనేక మంది భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. మహిళలు తమ ఇళ్లలో వరలక్ష్మి వ్రతాలు ఆచరించారు. అలాగే గోదావరి నదీ తీరాన గల సంతోషీమాత, మహాలక్ష్మి, వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయాల్లో ఉపా వాస దీక్షతో ఉన్న మహిళలు ఉద్యాపన పూజలు, కుంకుమ పూజలు జరిపారు. మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి మణిదీప వర్ణణ పూజ, లలిత, మహాలక్ష్మి అష్టోత్తరం, పంచామృతాభిషేకం, హారతి పూజలు చేసి నివేదన సమర్పించారు. ఆలయ అర్చకులు కొరిడె బాలక్రిష్ణ, మధ్వాచారి రాంకిషన్ అందంగా అలంకరణ చేసిన అమ్మవారలకు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు.



మహాలక్ష్మి దేవాలయంలో మహిళల కుంకుమ పూజలు

వ్యక్తి అదృశ్యం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 16: ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామానికి వ్యక్తి గుంటి పర్వతాలు అదృశ్యంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధిత కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. పర్వతాలు ఈ నెల 15న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 16: ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం పాటు పడుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, సతీష్, రవి, మధు, బాలకిషన్, శ్రీనివాస్, మనోజ్, ఆగం, మాధవ రెడ్డి, నరేశ్, మహేశ్, విద్యాసాగర్, ఎల్లం, దేవయ్య, రాంరెడ్డి, దేవ రెడ్డి పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని రామన్నపల్లె గ్రామానికి చెందిన గాదం లింగవ్వకు రూ. 60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకుడు మందాటి తిరుపతి యాదవ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అత్మకూరి నాగరాజ్, మందాటి రమేష్, గుండవేని మహేశ్, నక్క అనిల్, నాగండ్ల స్వామి , మందాటి దేవయ్య, తక్కల వేగం, పన్యాల బాపురెడ్డి, జూపల్లి నర్సయ్య, అత్మకూరి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండలం ఉమ్మడి మానాల గ్రామంలో 11 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దెగవాత్ తిరుపతి, మాజీ వైస్ ఎంపిపి పిసరి చిన్న భూమయ్య, రామ్‌దాస్, శ్యామ్ సుందర్, భూమానాయక్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థుల సంబరాలు

వీర్నపల్లి, ఆగస్టు 16: వీర్నపల్లి మండలం గర్జనపల్లి సీతారాంనాయక్ తండాకు చెందిన గిరిజన బిడ్డ ఎస్పీ భూక్య రాంరెడ్డి నాయక్ ఐపీఎస్‌కు ఎంపికవడంతో శుక్రవారం గ్రామస్థులు సంబరాలు నిర్వహించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో పుట్టి కష్టపడి చదువుతూ పోలీస్ శాఖలో 1989లో ఎస్సైగా ప్రభుత్వ ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. ఉద్యోగంలో రాణించి అంచెలంచెలుగా పదోన్నతులు పొందారు. ప్రస్తుతం సీఎంఎస్ ఎస్పీగా పనిచేస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. ఆయనను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

ప్రతీ హామీని నెరవేరుస్తాం

- అన్ని రంగాల్లో అభివృద్ధే ధ్యేయం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేములవాడలో భూమి పూజ చేస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ, ఆగస్టు 16: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పురపాలక సంఘం పరిధిలోని 14, 19 వ వార్డులలో ఎస్ డి ఎఫ్ నిధులతో నిర్మించనున్న వివిధ కుల సంఘాల భవనాలకు శుక్రవారం నాడు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడు తూ వేములవాడ పట్టణంలో 34 కుల సంఘ భవనాల నిర్మాణానికి ఎస్డిఎఫ్ ద్వారా నిధులను మంజూరు చేశామని, ఇటీవల కొన్ని భవనాలకు టెండర్ పూర్తి చేసుకొని నిర్మాణ పనులు ప్రారంభం అవుతున్నాయన్నారు. కులం అంటే బలం, బలగం అని, సమీక్ష సమావేశాల నిర్వహణకు, సమస్యల పరిష్కారానికి వేదికలుగా సామాజిక భవనాలు ఉపయోగపడతాయని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నిస్సహాయులకు సహాయం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నదని తెలిపారు. ఎన్నికలలో హామీ ఇచ్చిన విధంగా ఆరు గ్యారంటీలలో ఇప్పటికే కొన్ని అమలు చేస్తున్నామని అన్నారు. దేశ చరిత్రలో కనీవిని ఎరగని రీతిలో రైతులకు రుణమాఫీ చేసామని చెప్పారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని, కొత్తగా పెన్షన్లు, రేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవాలయం అభివృద్ధికి బడ్జెట్ లో 50 కోట్లు కేటాయించామని, మురుగు నీరు గుడి చెరువు లో కలవకుండ నూతన కల్వర్టుల నిర్మాణనికి భూమి పూజ చేసుకున్నామని తెలి పారు. పట్టణంలో అసంపూర్తిగా ఉన్న షాదీఖానా నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రోడ్డు విస్తరణతో పాటు వేములవాడ పట్టణంలో అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అన్వేష్, వైస్ చైర్మన్ బింగి మహేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలో సూరమ్మ జాతర వన భోజ నాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యేటా వర్షాకాలం లో సూరమ్మ జాతరలో భాగంగా వనభోజనాలు నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. సూరమ్మ వనభోజనాలకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై ప్రారంభించారు. అలాగే ప్రజలతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో సూరమ్మ జాతర నిర్వహకులు గడ్డం స్వామి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, తర్రె మనోహర్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కొమిరె శంకర్, గండి నారాయణ, చెలుకల తిరుపతి, మాడిశెట్టి అభి లాష్, పల్లి గంగాధర్, ఇప్ప మహేష్, నంద్యాడపు వేంకటేష్, ఎర్రం రాజలింగం, సూర యాదయ్య, స్వర్గం పరందామ్, పోగుల మహేష్, పూదరి మహిపాల్, మనోజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రుద్రంగి: వర్షాకాలం నేపథ్యంలో జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవా లని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వైద్య సిబ్బందికి ఆదేశించారు. రుద్రంగి మండల కేంద్రంలో శుక్రవారం బతుకమ్మ వాడలో ఆరోగ్య ఉప కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్త్ క్యాంపును ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు షుగర్ టెస్ట్, బీపీ పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ లక్ష్మి ప్రసన్న, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కొమిరె శంకర్, గండి నారాయణ, చెలుకల తిరుపతి, మాడిశెట్టి అభిలాష్, పల్లి గంగాధర్, ఇప్ప మహేష్, ఎర్రం రాజలింగం, సూర యాదయ్య, స్వర్గం పరందామ్, పోగుల మహేష్, వంగ మనోజ్, చెలుకల శ్రీకాంత్, అక్కనపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా చండీమహాయాగం



మొక్కులు చెల్లించుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కళచక్రపాణి

సిరిసిల్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీ లక్ష్మీగణపతి, మార్కండేయ, రుద్రయాగ పురస్సర నవ కుండాత్మక సహిత త్రయాహ్నిక శ్రీ చండీ మహాయాగం వైభవోపేతంగా నిర్వహించారు. సిరిసిల్లలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ భక్త మార్కండేయ దేవాలయ ప్రాంగణంలో ఉదయం గోపూజ, గణపతిపూజ, మండప పూజలు, కలశ స్థాపన, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అగ్నిప్రతిష్ఠ కుంకుమార్చనలు చేపట్టారు. చండీ మహాయాగాన్ని పద్మబ్రాహ్మణులు నిర్వహించారు. గోపూజ, ఇతర కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. పద్మశాలీ సంఘం సిరిసిల్ల అధ్యక్షుడు గోలి వెంకటరమణ, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ మాజీ చైర్మన్ అడెపు రవీందర్, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, పద్మశాలీ భవన్ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాస్, గాజుల బాలయ్య, మండల సత్యం, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

రుద్రంగి, ఆగస్టు 16: గ్రామాల్లో పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డిపివో వీరబుచ్చయ్య సూచించారు. రుద్రంగి మండల కేంద్రంతో పాటు మానాల గ్రామంలో శుక్రవారం డీపీవో వీర బుచ్చయ్య పర్యటించి, పలు కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనిల్లో రోడ్డులపై పెరుగుతున్న పిచ్చి మొక్కలను వేంటవేంటనే తోలగించాలని సూచించారు. గ్రామాల్లో క్లోరినేషన్ పనులు, మురికి కాలువలు శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి అంశాలపై, గ్రామాల్లో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏంపిడివో నాటరాజ్, ఏంపివో సుధకార్, కార్యదర్శి రామ్‌దాస్ పాల్గొన్నారు.

కాటమయ్య విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు ప్రారంభం

ఇల్లంతకుంట, ఆగస్టు 16: మండలంలోని కందికట్కూర్ గ్రామంలో కాటమయ్య విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు శుక్రవారంప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ చింతపల్లి వేణురావు, గౌడసంఘ అధ్యక్షుడు తాళ్ళపెల్లి రవీందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు బత్తిని విప్లవ్ గౌడ్, నాయకులు లచ్చయ్య, పొన్నం శేఖర్, లక్ష్మన్‌గౌడ్, రవి, రాజేశం, శ్రీనివాస్, కిషన్ పాల్గొన్నారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



ఇల్లంతకుంటలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, ఆగస్టు 16: మహిళలను అవమానపర్చిన కేటీఆర్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తు కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. మండలకేంద్రంలో శుక్రవారం కేటీఆర్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మానకొండూర్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తుంటే దీనిని జీర్ణించుకోలేని కేటీఆర్ మహిళలు బ్రేక్‌డ్యాన్స్‌లు చేయడం కోసం అనడం సరైన విధానం కాదన్నారు. కార్యక్రమంలో మహిళ అధ్యక్షురాలు సత్యారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెలిశాల జ్యోతి, మాజీ ఎంపీటీసీ తీగల పుష్పలత, సుజాత, నాయకులు బదుగు లింగం, కుమార్, సత్యం, చంద్రమౌళి, రాజేందర్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, సురేష్, వెంకటేష్, రవి, దాసు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని నాయకులు మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, రాజయ్య, దేవయ్య, రాంరెడ్డి, బాల్‌రెడ్డి, బాబు, శ్రీనివాస్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, పట్టణ శాఖ అధ్యక్షుడు పాపగారి రాజు, మాజీ ఎంపీటీసీ పర్శరాములు, సోషల్ మీడియా ఇన్‌చార్జి గౌరి శంకర్, నాయకులు జంగం రాజులు, బంగ్లా రాజు, భాస్కర్, బాలయ్య, కోట లింగం, మల్లయ్య తదితరులు ఉన్నారు.

కోనరావుపేట: మండల కేంద్రంలో మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా మాట్లాడుతూ మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మహిళలపై అనుచిత వ్యాఖ్యలను చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు చేపూరి గంగాధర్, మండల నాయకులు దేవరకొండ చారి, పల్లె మంజుల, రవీందర్ రెడ్డి, కేతిరెడ్డి లక్ష్మారెడ్డి, రమేష్ రెడ్డి, లింబయ్య తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: కేటీఆర్ మహిళలపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు రుద్రంగి మండలం మానాలలో మహిళలు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఆధ్యక్షుడు తూం జలపతి రవీందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలో కేటీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ మండల నాయకులు శుక్రవారం దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు జోగుల మంజుల, కాంతయ్య, రాములు నాయక్, నాయకులు పాల్గొన్నారు.



గంభీరావుపేటలో..

మహిళలపై కేటీఆర్ వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 16: మాజీ మంత్రి కేటీఆర్ మహిళలపై చేసిన వ్యాఖ్యలు సరికాదని కాంగ్రెస్ పార్టీ మహిళ జిల్లా అధ్యక్షురాలు కామునివనిత అన్నారు. సిరిసిల్ల పట్టణ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో వనిత మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్న మహిళలు అల్లికలు వేస్తున్నారని అనుచిత వ్యాఖలు చేశారని చెప్పారు. మహిళలు దర్జాగా అల్లికలు వేసుకుంటూ డబ్బులు సంపాదిస్తు న్నారని, నీ చెల్లెలా లిక్కర్ స్కాం చేసి డబ్బులు సంపాదించి తీహార్ జైల్లో లేరని మండిపడ్డారు. బస్సులో మహిళలు బ్రేక్, రికార్డింగ్ డ్యాన్స్‌లు చేస్తున్నారని వ్యాఖ్యానిం చి మహిళలను కించపరిచిన కేటీఆర్ వెంటనే భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు వెల్ముల స్వరూప మాట్లాడుతూ మాజీ మంత్రి అయి ఉండి ఉచిత బస్సులో మహిళలు ఉల్లిగడ్డలు పొట్టు తీస్తున్నారు అల్లికలు చేస్తున్నారని మాట్లాడడం సరికాదన్నారు. 50 శాతం ఓట్లు ఉన్న మహిళలు మీకు ఓట్లు వేస్తేనే నాడు రెండు సార్లు మంత్రిగా ఉన్నారని గుర్తు చేశారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకొని ప్రజా సమస్యలపై పోరాడాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ వచ్చాక సమస్యలు లేక పనికి రాని విషయాలను పట్టుకొని కేటీఆర్ పబ్బం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ మడుపు శ్రీదేవి, కాంగ్రెస్ మహిళ పట్టణ ప్రధాన కార్యదర్శి కోడం అరుణ, సభ్యులు కోడం సుధా, అప్ప పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ అందజేత

తంగళ్లపల్లి, ఆగస్టు 16: విద్యా బోధనను మరింత ఆసక్తిగా మార్చడం..విద్యార్థులకు సులభంగా పాఠాలు అర్థమయ్యేలా వివరించేందుకు గానూ తంగళ్లపల్లి మండలం సారంపల్లి ప్రభుత్వ పాఠశాలకు గ్రామ ప్రజలు రూ. 60వేల విలువ చేసే ప్రొజెక్టర్, కంప్యూటర్‌లను వితరణగా అందజేశారు. . ప్రొజెక్టర్, కంప్యూటర్‌లను కెనారా బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ గుగ్గిళ్ల రమేష్, తాజా మాజీ సర్పంచ్ కొయ్యడ రమేష్‌లు ప్రారంభించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రొజెక్టర్, కంప్యూటర్‌లను అందించిన గుగ్గిళ్ల నరేష్, అమర్ రావు, రమేశ్, బాలసాని బాలకిషన్, భాస్కర్, వంశీ, ఆనందం,. ప్రశాంత్, వినిష్ పర్శరాములు, సురేష్, కరుణాకర్, హరీష్, మశేష్, చందు, హరికృష్ణ, కిరణ్, ప్రభాకర్, రమేష్, రాజు, లక్ష్మి, ప్రసాద్ అందించగా ప్రధానోపాధ్యాయుడు సుల్తాన్ ఎల్లయ్య కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలకు మైక్ సెట్ బహూకరణ

బోయినపల్లి, ఆగస్టు 16: బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాలకు రూ 20 వేల విలువగల మైక్ సెట్ ను రిటైర్డ్ ఎంఈవో చేన్న మాధవుని రామరాజు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నందయ్య, ప్రధాన ఉపాధ్యాయులు తిరుపతి, అరుణ, తారక, నరసయ్య, పద్మ, శైలజ, వనజ తదితరులు పాల్గొన్నారు

వేములవాడ రూరల్: తాము చదువుకున్న పాఠశాలకు పూర్వ విద్యార్థులు సౌండ్ సిస్టంను అందజేసారు. నూకలమర్రి జిల్లా పరిషత్ పాఠశాలకు 25వేల రూపాయల విలువ గల సౌండ్ సిస్టంను 2002 పదో విద్యార్థులు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సదానందం, పూర్వ విద్యార్థులు బొడ్డు ప్రశాంత్ కుమార్, బైరి నారాయణ, గసికంటి తిరుపతి, లింగంపల్లి మోహన్, పొత్తూరి మల్లేశ్, వాసాల గణేష్, బాస రాజు, సాగర్, మేడుదుల శ్రీను, సుంకపాక కిరణ్, పిట్టల నవీన్, ఆడెపు పర్శరాములు, బాస స్వరూప, గుగ్గిళ్ల స్వరూప, బొడ్డు మణెమ్మ, విద్యా కమిటీ చైర్మెన్ కైర వసంత పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్ర పటానికి క్షీరాభిషేకం



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 16: మూడో విడత రుణమాఫీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని నాయకులు, రైతులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. స్థానిక బస్టాండు ప్రాంతాల్లో సంబరాలు నిర్వహించారు. . కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, రాజయ్య, బాబు, రాజేందర్, రాజునాయక్, రఫీక్, రవి, బాల్‌రెడ్డి, బుచ్చాగౌడ్, రాంరెడ్డి, రాములు, శ్రీనివాస్, కార్తీక్‌గౌడ్, మహేందర్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: రైతులకు రెండు లక్షలు రుణమాఫీ చేసినందుకు తంగళ్లపల్లి మండలం ఒబులాపూర్ గ్రామంలో కాంగ్రెస్ అధ్యక్షుడు పోచంపల్లి రమేశ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రైతులు అలువాల లక్ష్మణ్, కొత్త రవి, నేరెళ్ల అంజనేయులు, కందుకూరి మల్లేశం, కోల బుచ్చలయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

వర్షంతో రైతులకు ఊరట

సిరిసిల్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి కురిసిన వర్షం ప్రజలకు ఊరటను ఇచ్చింది. జిల్లాలో పలు చోట్ల వర్షం కురవడంతో పంటలకు జీవం పోసినట్లుగానే రైతులు చెబుతున్నారు. జిల్లాలోని కోనరావుపేటలో 66.8, ఎల్లారెడ్డిపేటలో 45. 3, ఇల్లంతకుంటలో 38.0, బోయినపల్లిలో 37. 3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షానికి రోడ్లపైకి వరదనీరు చేరడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

ఇల్లంతకుంట: పలు గ్రామాలలో శుక్రవారం సాయంత్రం భారీవర్షం కురిసింది. వర్షాకాలం ప్రారంభం నుంచి ఇదే భారీ వర్షమని రైతులు చెబుతున్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు ఎడతెరపి లేకుండా వాన పడడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మండల కేంద్రంతో పాటు అక్కపల్లి, దుమాల, తదితర గ్రామాల శివారుల్లోని రాపల్లి వాగు, లేతమామిండ్ల వాగులు ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు వరద నీటిలో మునిగిపోయాయి.



దుమాల రామిండ్ల వాడ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న రాపల్లివాగు

సభ్యులు ఓటు హక్కు వినియోగించుకోవాలి

- పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య



మాట్లాడుతున్న పద్మశాలి సంఘం జిల్లా నాయకులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 16: తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక కోసం సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య అన్నారు. సిరిసిల్ల పట్టణ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18న తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్ష ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. సిరిసిల్ల పట్టణం చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనం, వేములవాడలోని పద్మశాలి సంఘం భవనంలో పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిని ఎన్నుకోవడం కోసం పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 100 రూపాయల సభ్యత్వాలు 1,806, 1000 రూపాయాల సభ్యత్వాలు 158 ఉన్నాయని చెప్పారు. ఓటు హక్కు ఉన్న సభ్యులందరు ఆధార్‌కార్డుతో పాటు సభ్యత్వం నమోదు చేసుకున్నపుడు ఇచ్చిన రశీదు తీసుకొని పోలింగ్ కేంద్రాలకు రావాలన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 13 మండలాలో ఉన్న పద్మశాలి సంఘం ఓటర్లలో సిరిసిల్ల నియోజకవర్గం వారు సిరిసిల్ల పట్టణం వస్త్ర వ్యాపార సంఘం పోలింగ్ కేంద్రంలో ఓటు వేయాలన్నారు. వేములవాడ నియోజకవర్గం పరిధిలోని ఓటర్లు వేములవాడ పట్టణంలోని పద్మశాలి సంఘం భవనం పోలింగ్ కేంద్రంలో ఓటు వేయాలని కోరారు. ఈ నెల 18న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ ఉంటుందన్నారు. పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఇద్దరు మాత్రమే పోటీలో ఉన్నారని వివరించారు. ఇరువురిలో ఎవరు నచ్చితే వారికి సభ్యులు ఓటు వేయాలన్నారు. 100 శాతం ఓటింగ్ జరగాలని సభ్యులందరు ఓటింగ్‌లో తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండ ప్రతాప్ మాట్లాడుతూ పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య అధ్యక్షతన ఈ రోజు జిల్లా కార్యవర్గం సమావేశం జరిగిందన్నారు. పద్మశాలి సంఘం జిల్లా ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల కమిటిని ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లా కమిటి అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, సభ్యులుగా కొండ ప్రతాప్, నాగుల విష్ణుప్రసాద్, గడ్డం విఠల్, గాజుల హరిని నియమిస్తూ తీర్మానం చేశామని తెలిపారు. జిల్లా పరిధిలోని 13 మండలాల అధ్యక్షులు కమిటి సభ్యులుగా కొనసాగుతారని అన్నారు. పద్మశాలి సంఘం జిల్లా ఎన్నికలలోపు గుర్తింపు కార్డులు, కొత్త సభ్యత్వాల స్వీకరణ ఉంటుందని సభ్యులందరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పద్మశాలి సంఘం జిల్లా కోశాధికారి గడ్డం విఠల్, ఉపాధ్యక్షుడు జక్కని లక్ష్మీనారాయణ, నాయకులు నాగుల విష్ణుప్రసాద్, గాజుల హరి, వెంగళ రవీందర్, వెంగళ కృష్ణహరి, రిక్కుమల్ల సంపత్, బాలకృష్ణ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల నిరసన దీక్ష



నిరసన దీక్ష చేస్తున్న కార్మికులు

తంగళ్లపల్లి, ఆగస్టు 16: సమస్యలు పరిష్కారించాలని తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి టెక్స్‌టైల్ పార్కు కార్మికులు శుక్రవారం ఒక్కరోజు నిరసన దీక్ష చేశారు. దీక్ష శిబిరాన్ని సందర్శించి సీఐటీయూ తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, నా యకులు అన్నల్‌దాస్ గణేశ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూతపడ్డ పరిశ్రమలను తెరిపించాలని, పూర్తి స్థాయిలో పరిశ్రమలు నడిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. టెక్స్‌టైల్ పార్కు యాజమానులు, ఆసాములు కార్మికులకు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో టెక్స్‌టైల్ పార్కు అధ్యక్షుడు కూచన శంకర్, కొండ కనకయ్య, ఆడెపు సంపత్, గోరిట్యాల బాలరాజ్, బూర శ్రీనివాస్, జెల్ల సదానందం, గోవిందు నాగయ్య, వేముల వెంకటేశం, పులి రమేశ్, బొల్లి శంకర్, కొండి దత్తాద్రి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

- పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలు
- కిటకిటలాడిన ఆలయాలు

చందుర్తి, ఆగస్టు 16: మండల కేంద్రంలోని మహాలక్ష్మీ ఆలయంతో పాటు మల్యాల గ్రామంలో శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతంను శుక్రవా రం వ్రతం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి మహిళలు ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీ వేంకటేశ్వరస్వా మి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించి ఒడి బియ్యం పోసి, కుటుంబ సభ్యులు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారికి మొక్కు లను చెల్లించారు. ఆలయ అర్చకులు కాందాలై వెంకటరమణాచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ బాశెట్టి భాస్కర్ పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: పట్టణంలోని వివిధ ఆలయాలతో పాటు ఇళ్లలో మహిళలు వరలక్ష్మి పూజలు వైభవంగా జరుపుకున్నారు. పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో సంతోషిమాత గుడితో పాటు ఆర్యవైశ్య భవనంలోని సంతోషిమాత ఆలయంలో, విశ్వనాథ స్వామి ఆలయంలో మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై వరలక్ష్మీ అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

ఎల్లారెడ్డిపేట: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్ల బొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, నారాయణపూర్, అల్మాస్‌పూర్, బండలింగంపల్లి తదితర గ్రామాల్లో వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల్లో అమ్మవార్లకు ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు.



మల్యాలలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు